# గజ మరణం

"గురువుగారు మీరు యీ సమస్యని గురించి అనవసరంగా హైరాణ పడవద్దు. ఎంత తక్కువలో చేయడానికి వీలు అవుతుందో ఆ ప్రకారం చేద్దాం. మిమ్మల్ని భయపెట్టడానికి చెప్పడం లేదు. కాని యీ వైద్యం ఎంత త్వరగా చేయించుకుంటె అంత మంచిది. ఆలస్యం చేయడం వలన అదనంగా ఖర్చు పెరగడం, నయమవడానికి చాలా ఎక్కువ కాలం పట్టడం..."

తన ఎదుట నున్న రిపోర్టు... అన్నీ పరీక్ష చేస్తూ- డా॥ రమేశ్‌చంద్ర, డైరెక్టరు, ఆరోగ్య సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటలు అధినేత- రోగితో ఉన్నాడు.

రోగి చాలా సేపు మవునంగా వుండి మూడు ప్రశ్నలు వేశాడు.

"చికిత్సకు ఎంత అవుతుంది?"

"చికిత్స తరువాత నేను ఎంతకాలం బ్రతకడానికి అవకాశం వుంది?"

"నాకు చావు అంటె భయం లేదు. కాని నేను పూర్తి చేయవలసిన పనులు ఉన్నాయి. తీర్చవలసిన బాధ్యతలు ఉన్నాయి. పరిష్కారం కావలసిన సమస్యలు ఉన్నాయి. వాటిని పూర్తి చేసుకుని, యీ అవతారం చాలిస్తే, నా మనస్సుకు, ఆత్మకు శాంతి కలుగుతుంది.

డాక్టరుగారు రవ్వంతసేపు అంతర్ముఖులైయ్యారు. మౌనం వహించాడు.

"మాష్టరుగారూ, మీరు మాకు చిన్నప్పుడు చదువు చెప్పిన గురువులు. మీ ఆశీస్సుల వలనే మాకు నాలుగు ముక్కలు వచ్చాయి. ఈ స్థితికి రాగలిగాను. నా గురువుకు నేను ఉచితంగా వైద్యం చేస్తాను. కాని యీ హాస్పిటలు నా ఒక్కడిది కాదు గదా. చాలామంది పార్టనర్సు వున్నారు. కోట్లకొలది పెట్టుబడితో కూడిన వ్యవహారం- ఉచితంగా చేయమని అడగలేము కదా!

సాధారణంగా యీ వైద్యానికి- దాదాపు ఏడెనిమిది లక్షలు ఖర్చు అవుతుంది. మీరు మా మనుష్యులు- కావలసినవారు - నాలుగైదు లక్షలు దాటకుండా యీ వ్యవహారం పూర్తి అయ్యేట్టుగా నేను చూస్తాను.

డబ్బు ఏర్పాటు చేసుకుని నాకు కనిపించండి. వైద్యం ప్రారంభిద్దాము. మరీ ఆలస్యం చేయవద్దు. ఈ లోపల యీ మాత్రలు రోజూ మూడు పూట్లా

వేసుకోండి. రాత్రి పూట పడుకోబోయే ముందు యీ టానిక్కు త్రాగండి. హాయిగా నిద్దర పడుతుంది.

మిగతా విషయాలు గురించి- యిప్పుడు కాదు ఆలోచించడం- వైద్యం పూర్తి కానివ్వండి. అప్పుడా విషయం గురించి ఆలోచిద్దాం. మీరు యిక్కడికి ఎల్లా వచ్చారు?''

"నడిచి."

"మా కార్లో యింటికి వెళ్ళండి. ఇంత దూరాన నడవవద్దు." రిటైర్డు-ఎలిమెంటరీ స్కూలు మాష్టరుగారికి వాహన యోగం పట్టింది.''

పల్లె పట్టణం కాని వూరు అది. వెంకటరామయ్యగారు- ఆ కుగ్రామంలో-శ్రీమంతుల పిల్లలకు చదువు చెప్పే పేద పంతులు. బ్రతకలేక బడిపంతులుగా జీవితం గడిపిన వారు.

పెంకుటిల్లు- రెండు ఎకరాల భూమి- చాలీ చాలని జీతం. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న కుమారుడు- పెండ్లికి సిద్ధంగా వున్న కుమార్తె.

బ్రతికి ఉన్నంత కాలం దారిద్ర్యంలో బ్రతికి- అనారోగ్యంతో బాధపడి-అర్ధాయుష్కురాలుగా- తనువు చాలించిన యిల్లాలు.

ఇంతకు మించిన ఆస్తులు లేవు. అన్నింటి కంటె ముఖ్యం తీర్చవలసిన అప్పులు గూడా లేవు.

అదే తను చేసుకున్న అదృష్టం.

డాక్టరుగారు చెప్పిన మాటలు మననం చేసుకున్నాడు. ఆయన పైకి బిగ్గరగా చెప్పకపోయినా తనకు తేలికగా అర్థమయిన విషయం. తనకు తీవ్రమైన వ్యాధి ఏదో వచ్చింది. తన మీద దయ కొద్ది తగ్గించినా నాలుగైదు లక్షల ఖర్చు. అంటే జీవితం ప్రొద్దు వాలిపోతోంది. బ్రతుకు హంసగీతం పాడటానికి సిద్ధంగా వుంది.

రాలిపోవటానికి సిద్ధంగా వున్న శిధిల శరీరం ఎంత చేసినా ఇది శాశ్వితం కాదు. దీనిని బాగు చేయటానికి ప్రయత్నం చేయటం వ్యర్థం, మూర్ఖత్వం.

*"జాతస్యేః ధృవో మృత్యుః*
*పునరపి జననం! పునరపి మరణం!!"*

వెంకట్రామయ్యగారికి కొండంత ధైర్యం వచ్చింది. కర్తవ్యం తెలిసింది. ఏ విషయానికి ప్రాధాన్యం ఇవ్వాలో అవగాహన అయ్యింది.

ఉద్యోగ ప్రయత్నంలో వున్న కుమారుడి సమస్య మీద మనస్సు నిలిపాడు.

రెండు లక్షల రూపాయలు సెక్యూరిటీ యిస్తే అబ్బాయికి కోపరేటివ్ బ్యాంకులో క్యాషియర్‌గా ఉద్యోగం యిస్తారని తెలిసిన నాడు అది మన శక్తికి మించిన పని అవుతుంది. అవసరానికి ఉపయోగపడని ఆస్తి ఎందుకు అనే ఆలోచన వచ్చింది. పొలం అమ్మకానికి పెట్టాడు. 'మొత్తం అమ్మేయండి. నాలుగు లక్షలు యిస్తామని' ఆసాములు అన్నారు. అప్పుడు యింకొక ఆలోచన వచ్చింది. అమ్మాయికి సంబంధాలు చూడటం మొదలు పెట్టాడు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కుర్రవాడి సంబంధం వచ్చింది.

కుర్రవాడి మేనమామ వెంకటరామయ్యగారి దగ్గర చదువుకున్నాడట. 'కట్న కానుకలు అక్కర్లేదు. హడావిడి, ఆడంబరాలు లేకుండా పెండ్లి చేయండి. పిల్లవాడికి రాను పోను టిక్కెట్టు, అమ్మాయికి అమెరికా వెళ్ళడానికి టికెట్టు కొని యివ్వండి చాలు' అని అడిగారు. సరే అన్నాడు. ఇల్లు అమ్మకానికి పెట్టాడు.

ఇదంతా చూస్తున్న పిల్లలు అడిగారు. "ఆస్తి అంతా అమ్మేస్తే నువ్వు ఎల్లా బ్రతుకుతావు?"

ఆయన నవ్వుతూ సమాధానం చెప్పాడు. 'మహారాజులాగా.'

పొలం అమ్మకం జరిగింది. అబ్బాయి ఉద్యోగంలో చేరాడు. గుణవంతు రాలు, బుద్ధిమంతురాలు అయిన పేదయింటి పిల్లను కట్నం లేకుండా వివాహం చేసుకున్నాడు. ఆ కుర్రవాడి ఔదార్యానికి వెంకట్రామయ్యగారు చాలా సంతోషించారు.

అమెరికా పెళ్ళికొడుకు వచ్చాడు. అమ్మాయిని చూసాడు. పెళ్ళి చూపుల్లోనే పిల్ల నచ్చడం, ముహూర్తాలు నిర్ణయించడం అన్నీ క్షణాలమీద జరిగిపోయాయి. వెంకట్రామయ్యగారి కొడుకు, కోడలు పీటల మీద కూర్చుని కన్యాదానం చేశారు.

డాక్టరుగారు పెళ్ళికి వచ్చారు. మంచి బహుమతి యిచ్చారు. వెళ్ళబోయే ముందు వెంకట్రామయ్యగారి దగ్గరకు వచ్చి, "ఈ హడావిడి అయిన తరువాత ఒక్కసారి పరీక్ష చేయించుకోండి. అశ్రద్ధ చేయవద్దు. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. వైద్యం చేయించుకోండి."

వెంకట్రామయ్యగారు "తప్పకుండా వస్తాను. ఈ హడావిడి కానివ్వండి' అన్నారు.

డాక్టరుగారి ముఖంలో సంతోషం కనిపించలేదు. మనస్సులో నుంచి నిట్టూర్పు వచ్చింది.

ఈ హడావిడి పూర్తి అయి, అమ్మాయికి వీసా వచ్చి అమెరికా వెళ్ళడానికి రెండు నెలలు పట్టింది.

తీరిక చిక్కగానే వెంకట్రామయ్యగారు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళారు. చిన్ననాటి గురువుగారిని ఆయన శ్రద్ధగా అన్ని పరీక్షలు చేసాడు.

ఒకే ఒక్క ప్రశ్న వేసాడు. "ఇంత బాధని ఎలా భరిస్తున్నారు. సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారు?"

"బాధ్యతలను స్మరిస్తూ, శరీరాన్ని విస్మరిస్తూ!"

"బాధ్యతలు తీరిపోయాయిగా."

"శరీరాన్ని గురించి ఆలోచించే తీరిక చిక్కిందిగా. అందుకనే మీ దగ్గరకు వచ్చాను."

"ఈ మందులు, యీ టానిక్కులు వాడండి. నిద్దర పట్టకపోతే యీ మాత్రలు ఒక్కటి వేసుకోండి."

"ఆపరేషన్..."

డాక్టరుగారు ఒక్క క్షణం ఆలోచించారు. "వద్దు. ప్రయోజనం వుండదు.'

"ఎంత కాలం యీ యాతన సహించాలి? సంవత్సరాలా? నెలలా? రోజులా?"

"నెలలు."

వెంకట్రామయ్యగారు ఒక్క క్షణం ఆలోచనలో పడ్డారు. "ప్రయాణం చేయవచ్చునా?"

"తప్పకుండా. ఎక్కడికి వెడదామనుకుంటున్నారు?"

వెంకట్రామయ్యగారు సమాధానం చెప్పలేదు. బయలుదేరి ఇంటికి వచ్చేసారు.

సుమారు రెండు నెలల తరువాత హృషీకేశం నుంచి డాక్టరుగారికి ఉత్తరం వచ్చింది.

"చి॥ రమేశ్ చంద్రకు

ఆశీస్సులు.

మా చిన్నతనంలో ఏనుగులను గురించి ఒక వ్యాసం చదివాను. అది నాకు గుర్తుకు వచ్చింది.

తన మరణం ఎప్పుడు వస్తుందో, ఏనుగుకు ముందుగానే తెలుస్తుందని. ఆ ముసలి ఏనుగు గుంపును వదిలి దూరంగా ఒంటరి ప్రదేశానికి పోయి, ఆహారం విసర్జించి, ఉపవాసం చేసి శరీరాన్ని, ప్రాణాన్ని వదిలి పెడుతుందని. రోగగ్రస్థమై,

శరీరం శిథిలమైన జంతువు- తన వారిని కాపాడలేక- తను యితరులకు భారం అవుతుందని- యీ పనిని చేస్తుందని ఆ వ్యాసంలో చదివాను. ఏనుగు బొమికలు ఎక్కడైనా నేలమీద కనిపిస్తే, మిగతా ఏనుగులు వాటిని తొండంతో పట్టుకుని, ఎవరూ లేనిచోటుకు తీసుకువెళ్ళి భూమిలో పూడ్చి పెడతాయట.

నాకు వచ్చిన వ్యాధిని గురించి నాకు రెండు విషయాలు తెలుసు. ఈ వ్యాధికి చికిత్స లేదని. అంత్య దశలో యీ వ్యాధిగ్రస్తుడు వికృతంగా, వికారంగా, చూడ భయంకరంగా వుంటాడని-

సంతోషంగా, బలంగా, మంచి రూపంతో ఉన్న నన్ను చూడటానికి అలవాటుపడ్డ మీ అందరికి- ముఖ్యంగా, నా సంతానానికి- ఈ పీడకల తప్పించాలని మీ అందరికి దూరంగా వచ్చాను. చాలా దూరంగా అనంతంలోకి వెళ్ళడానికి వచ్చాను. పరమపద సోపానంలో- యీ నగరం నాకు మొదటిమెట్టు- నేను పంచభూతాలలో కలిసిన తరువాత యీ ఉత్తరం మీకు పంపించమని కోరాను. నా పిల్లలను ఓదార్చే భారం మీకు అప్పచెప్తున్నాను.

ఆశీస్సులతో...

మీ చిన్ననాటి గురువు

వెంకటరామయ్య

ఉత్తరం కింద రెండు వాక్యాలున్నాయి.

"చిత్రభాను నామ సం॥ర మాఘ శుద్ధ పౌర్ణమి ఆదివారం ది. 16-2-2003 ఉదయం శ్రీ వెంకటరామయ్యగారు స్వర్గస్థులయ్యారు. వారి పార్థివ శరీరానికి అగ్ని సంస్కారము గంగా తీరాన ఆరోజు సాయంకాలం జరిగినదని మీకు తెలియపరుచుచున్నాను."

కార్యదర్శి

"ఆంధ్ర ఆశ్రమం"

హృషీకేశం